# సామ్రాజ్యవాద శక్తుల దోపిడీ సాధనంగా డాలర్ ఆధిపత్యం

**ఉక్రెయిన్‌తో** రష్యా యుద్ధం సందర్భంగా యుద్ధ విరమణ ఒత్తిడి కోసం రష్యా మీద అమెరికా విధించిన అనూహ్యమైన ఆంక్షల నేపథ్యం ట్రిగ్గర్‌గా పనిచేసింది. గత ఒకటిన్నర దశాబ్దాలుగా అమెరికన్ డాలర్ ఆధిపత్యం మీద కొనసాగుతున్న నిరసనలు దీనితో తీవ్రం అయినాయి. నాటోలో ఉక్రెయిన్ సభ్యత్వంతో ముడిపడి ఉన్న అమెరికా నిర్ణయమే ఫిబ్రవరి, 2022లో మొదలైన యుద్ధానికి అసలు కారణం. ఈ అంశాన్ని ఏ దేశమూ ప్రశ్నించదు. అమెరికా ప్రస్తావించదు. ప్రపంచంలో చాలా దేశాలు - యూరప్, అమెరికాతో సహా రష్యా నుండి చమురు, గ్యాస్‌లను, ఇతర విలువైన ఖనిజాలను, వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటాయి. ఈ దిగుమతుల మీద అమెరికా ఆంక్షలను విధించింది, నిషేధించింది. మిగిలిన దేశాలు కూడా ఈ నిర్ణయాన్ని అమలు చేయాలని శాసిస్తున్నది, ఒత్తిడి తీసుకు వస్తున్నది. కోవిడ్-19 విపత్తు, తదనంతర పరిణామాలతో సంక్షోభంతో సతమతమవుతున్న దేశాలకు, చమురు, గ్యాస్ కొరతతో ధరలు ఆకాశాన్నంటాయి. ద్రవ్యోల్బణాన్ని భరించటం పెద్ద సవాలుగా మారింది. ఫలితంగా అమెరికా విధిస్తున్న ఆంక్షల మీద దేశాల వ్యతిరేకత తీవ్రమైంది.

పైగా, ఆంక్షల పేరిట అమెరికాలో రష్యా దాచుకున్న 630 బిలియన్ల అమెరికన్ డాలర్లను స్తంభింపచేసింది. ఇంతటితో ఆగలేదు. రష్యా అధ్యక్షుడు పుతిన్ కుమార్తెలు, సన్నిహిత బంధువులు, ఉన్నతాధికారులు, బిలియనీర్లు, రష్యాలో సంస్థల అమెరికన్ డాలర్ల రూపంలో వున్న డిపాజిట్లను, ఫైనాన్స్ ఆస్తులను స్తంభింప చేసింది. వాళ్ళ కదలికల మీద విపరీతమైన ఆంక్షలను విధించింది. అయితే, గ్లోబల్ కరెన్సీగా బలపడిన అమెరికన్ డాలర్ల రూపంలో తమ సంపద భద్రంగా వుంటుందన్న నమ్మకంతో ప్రపంచ దేశాల సంపన్నులు తమ సంపదను అమెరికన్ బ్యాంకులలో డిపాజిట్ చేస్తారు. అమెరికా బాండ్లను, సెక్యూరిటీలను కొంటారు. అమెరికా, తన ఆధిపత్యం కోసం, పట్టు కోసం నియంతలా విధించే ఆంక్షలు తమ వరకు రావన్న గ్యారంటీ ఏమిటి అన్నది ప్రపంచ సంపన్నుల ముందున్న ప్రశ్న. తమకు అవసరమైన సమయంలో అమెరికన్ డాలర్ల రూపంలో వున్న తమ సొమ్మును వాడుకోగలిగే పరిస్థితులు ఉంటాయా అన్న అభద్రతా భావపు స్థాయి ఆ సంపన్న వర్గంలో తీవ్రమైంది.

ఇట్లా పాశ్చాత్య సామ్రాజ్యవాద దేశాల, ప్రపంచంలోని వివిధ దేశాలలోని సంపన్న వర్గాల అసంతృప్తులు డాలర్ ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తున్నాయి. ప్రత్యామ్నాయం కావాలంటు న్నాయి. సామ్రాజ్యవాద శక్తుల దోపిడీ సాధనంగా ఉన్న అమెరికన్ డాలర్ స్థానంలో మరే కరెన్సీ వచ్చినా కూడా తృతీయ ప్రపంచ దేశాలకు, పీడిత వర్గాలకు సమకూరే ప్రయోజనం ఏమీ ఉండదు.

అమెరికన్ డాలర్, గ్లోబల్ ఫైనాన్షియల్ సూపర్ పవర్‌గా వున్నదని సూచించే అంశాలు ఏమిటి? అమెరికన్ డాలర్ గ్లోబల్ కరెన్సీగా రూపొంది, బలపడిన క్రమం ఏమిటి? దీని ప్రభావంతో తృతీయ ప్రపంచ దేశాల ఆర్థిక నిర్మాణాలు ఏమైనాయి? అమెరికా విధిస్తున్న ఆంక్షలు సూచిస్తున్నదేమిటి? డాలర్ ఆధిపత్యం అంతరిస్తే, సమత్వం పునాదిగా గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ నిర్మాణాలు ఏర్పడతాయా? ఈ అంశాలన్నింటినీ సీరియస్‌గా చర్చించాలి.

**గ్లోబల్ ఫైనాన్షియల్ సూపర్ పవర్‌గా అమెరికన్ డాలర్ :**

ప్రపంచవ్యాప్తంగా లావాదేవీలన్నీ అంటే ఎగుమతులు, దిగుమతులు, పెట్టుబడులు, అప్పులు, చెల్లింపులు అన్నింటినీ అమెరికన్ డాలర్లలోనే లెక్కిస్తారు. అన్ని దేశాల కరెన్సీ మారకం రేటును కూడా అమెరికన్ డాలర్లలోనే చెబుతారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ ప్రకారం ప్రపంచంలోని 185 దేశాలలో ఎవరి కరెన్సీలు వాళ్ళవే; ఆయా దేశాలకే పరిమితం. కాగా అమెరికన్ డాలర్ ప్రపంచమంతటా చెల్లుబాటు అవుతుంది; గ్లోబల్ కరెన్సీగా బలపడింది. అందువల్లనే, గ్లోబల్ వ్యవస్థ డాలరీకరణ చెందిందని అంటారు.

ప్రపంచ దేశాలు, సెంట్రల్ బ్యాంకులు, వాణిజ్య సంస్థలు అన్నీ అమెరికన్ డాలర్లలో నిల్వలకే ప్రాధాన్యతనిస్తాయి. ఐఎంఎఫ్ నివేదిక - 2020 ప్రకారం ప్రపంచ రిజర్వు కరెన్సీలో అమెరికన్ డాలర్ వాటా 61 శాతం కన్నా ఎక్కువ. రెండవ స్థానంలో వున్న యూరో కేవలం 20.5 శాతం. అమెరికన్ డాలర్ ఆధిక్యత ఏ స్థాయిలో ఉన్నదో ఇందువల్ల అర్థమవుతుంది. శీఘ్రంగా అభివృద్ధి చెందుతున్న చైనా కూడా అమెరికన్ డాలర్లకే ప్రాముఖ్యతనివ్వటం ఆశ్చర్యకరం. ఒక ట్రిలియన్ అమెరికన్ డాలర్ల నిల్వలు చైనాలో వున్నాయి. (ఒక ట్రిలియన్ = లక్ష కోట్లు)

గ్లోబల్ ఫైనాన్షియల్ నెట్‌వర్క్ అమెరికా స్వాధీనంలోనే వున్నది. ఫారెక్స్ (విదేశీ మారకద్రవ్య) వాణిజ్యంలో 90 శాతం చెల్లింపులు, స్విఫ్ట్ (సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్ బ్యాంక్ ఫైనాన్షియల్ టెలికమ్యూనికేషన్స్) చెల్లింపులలో 40 శాతం అమెరికన్ డాలర్లలోనే. నిజానికి స్విఫ్ట్ ఫైనాన్షియల్ నెట్‌వర్క్ అమెరికా నియంత్రణలోనే వుంటుంది. ప్రపంచ వాణిజ్యంలో 80 శాతం అమెరికన్ డాలర్లలోనే. అంతేకాకుండా, ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంకులలో వున్న విదేశీ మారకద్రవ్య

నిల్వలలో అమెరికన్ డాలర్ల వాటా 65శాతం. గ్లోబల్ ఫైనాన్స్ రంగంలో అమెరికా ఆధిపత్యం ఏ స్థాయిలో వుందో స్పష్టం అవుతూనే వున్నది.

అంతర్జాతీయ చెల్లింపులన్నీ అమెరికన్ డాలర్లలోనే వుండడం వల్ల డాలర్‌కు డిమాండ్ పెరుగుతూనే వున్నది. ఇంకా, ఐఎంఎఫ్ లోని 189 సభ్యదేశాలు, సంస్థలో చేయవలసిన డిపాజిట్లలో కొంత శాతం తప్పనిసరిగా అమెరికన్ డాలర్లలోనే చేయాలన్న నిబంధన వల్ల డాలర్‌కు డిమాండ్ అదనంగా పెరుగుతున్నది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణతో దేశాలపై తమ ఆధిపత్యాన్ని నెరపడంలోనూ, సామ్రాజ్యవాద దోపిడీకి నిరంతరం సాధనాలుగా ఉపయోగపడే ఐ.ఎం.ఎఫ్ వంటి ఆర్థిక సంస్థల నిధుల ప్రవాహం ద్వారా అమెరికన్ డాలర్ పెత్తనం మరింతగా స్థిరపడుతూ వచ్చింది.

అమెరికన్ డాలర్ల సరఫరాలో 65 శాతం పైగా అమెరికా బయట ఇతర దేశాలలో వినియోగిస్తారు. అందువల్లనే, అమెరికా ఎన్ని డాలర్లను, పెద్ద మొత్తంలో ముద్రించినా దేశంలో ద్రవ్య సరఫరా పెరగదు. కాబట్టి ఈ కారణంగా అక్కడి ధరలు పెరగవు. విదేశీ మారక ద్రవ్య చెల్లింపుల శేషానికి సంబంధించిన సమస్యలు కూడా వారికి రావు. అందుకే అమెరికన్ ఆర్థికవేత్త పాల్ శామ్యూల్ సన్ ఏమని అంటాడు అంటే అమెరికన్ డాలర్‌కున్న విపరీతమయిన డిమాండ్ వల్ల అమెరికా ప్రభుత్వ పరిధిలో పనిచేసే ఫెడరల్ రిజర్వు బ్యాంకు ఎటువంటి డిఫాల్ట్ రిస్క్ లేకుండా అతి తక్కువ వడ్డీకి అమెరికన్ డాలర్లను ఇష్యూ చేయగలదు. వడ్డీరేటు మార్పులతో ప్రపంచ దేశాలలో డాలర్ సరఫరాని ప్రభావితం చేస్తుంది. అంతే కాకుండా అమెరికా కరెంట్ అకౌంట్‌లో ఎంత లోటు వున్నా డాలర్ మారకపు రేటు తగ్గదు. అందువల్ల డాలర్ ప్రపంచానికి ఒక నమ్మకమైన ఆస్తి. గ్లోబల్ మూలధన మార్కెట్ నుండి ట్రిలియన్ల అమెరికన్ డాలర్లను అమెరికా సునాయాసంగా రుణంగా పొందగలదు అంటాడు పాల్ శామ్యూల్ సన్. అంటే అమెరికన్ పెట్టుబడిదారుల సంక్షోభాన్ని ప్రపంచానికి కొద్ది కొద్దిగా పంచడానికి వారికి డాలర్ ఆధిపత్యం నేరుగా ఉపయోగపడుతుందన్నమాట.

అమెరికా విడుదల చేసిన 100 అమెరికన్ డాలర్ల విలువ గల బిల్లులలో 80 శాతం అమెరికా బయట చెలామణిలో వున్నాయి. అమెరికా ట్రెజరీ మార్కెట్ విలువ 23 ట్రిలియన్ల అమెరికన్ డాలర్లు. రెండవ స్థానంలో ఉన్న జపాన్ ప్రభుత్వ బాండ్ మార్కెట్‌కిది రెండు రెట్లు. అమెరికా విదేశీ ట్రెజరీ హోల్డింగ్స్ విలువ 7.74 ట్రిలియన్ల అమెరికన్ డాలర్లు.

ప్రపంచ ఫైనాన్స్ మార్కెటును శాసిస్తున్న అమెరికా, అతి తక్కువ వడ్డీకి కార్పొరేట్లకు రుణాలనిస్తుంది. అందువల్లనే, 2021లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 77 శాతం పెరుగుదలతో 1.65 ట్రిలియన్ అమెరికన్ డాలర్లు. కాగా, అమెరికా విదేశీ పెట్టుబడుల పెరుగుదల 114 శాతం అని, పెట్టుబడుల విలువ 323 బిలియన్ల అమెరికన్ డాలర్లు అని, ప్రపంచ రుణాలలో 39 శాతం రుణం అమెరికన్ డాలర్లలోనే అని అంచనా. అమెరికా నాయకత్వంలోనే ఫైనాన్స్ పెట్టుబడి వర్ధమాన దేశాలలో విస్తరిస్తున్నది, బలపడుతున్నది. అభివృద్ధి చెందుతున్న దేశాలు అనే పేరుతో ఇండియా వంటి దేశాల్లోని బడా పెట్టుబడిదారీ వర్గాల ఆస్తులు ప్రపంచ కుబేరులకు తోడుగా చేరుతున్నాయి. అయినా ఆయా కంపెనీల ఫైనాన్స్ పెట్టుబడుల వాటాలను విదేశీ కార్పొరేట్లు సునాయాసంగా కొనేస్తున్నాయి. ఆ విధంగా లాభాల పేరుతో వర్ధమాన దేశాల నుంచి సంపద తరలింపు నిరంతరాయంగా కొనసాగుతూనే వున్నది. అమెరికా వడ్డీ రేటు తగ్గించినప్పుడు, పెట్టుబడులు వర్ధమాన దేశాలకు తరలివెళ్తాయి. అట్లా కాకుండా, వడ్డీ రేటు పెరిగితే మళ్లీ పెట్టుబడులు అమెరికాకు తిరిగి వెళ్తాయి. వర్ధమాన దేశాలలో ఎప్పుడూ ఇక అనిశ్చిత పరిస్థితే. విదేశీ పెట్టుబడులను ఆకర్షించటానికి తమ దేశాల నుంచి వెళ్ళిపోకుండా ఉండటానికి ఈ దేశాలు గ్లోబల్ ఆర్థిక సంస్థల ఆదేశాల మేరకు నిరంతరం రాయితీలను, ప్రోత్సాహకాలను ప్రకటించి అమలు పరుస్తూనే వుంటాయి. సామ్రాజ్యవాద దోపిడీ శక్తుల ఫైనాన్స్ పెట్టుబడి విషవలయంలో తృతీయ ప్రపంచ దేశాలు అధీన వ్యవస్థలుగా, బందీలుగా మిగిలిపోతున్న పరిస్థితి మన కళ్ళ ముందున్న వాస్తవం.

ఏ సంక్షోభమైనా ఆధిపత్య వ్యవస్థలను, వర్గాలను బలోపేతం చేస్తుంది. అదేవిధంగా 2008లోని సబ్ ప్రైమ్ సంక్షోభం, కోవిడ్-19 విపత్తు రెండు సందర్భాలలోనూ అమెరికన్ డాలర్‌కి డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. అది ఆధిపత్య కరెన్సీగా మరింత బలపడింది.

**గ్లోబల్ కరెన్సీగా అమెరికన్ డాలర్ – తృతీయ ప్రపంచ దేశాలు :**

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత 1944లో బ్రెటన్ వుడ్స్‌లో జరిగిన ప్రపంచ దేశాల సమావేశంలో సరియైన నియమ నిబంధనల ద్వారా బలమైన ఫైనాన్షియల్ వ్యవస్థ ఉండాలని చర్చ జరిగింది. ఈ ఒప్పందంలో అమెరికన్ డాలర్‌ను గ్లోబల్ కరెన్సీగా గుర్తించటం వల్ల 1950ల నుండి అమెరికా, ప్రపంచ ఫైనాన్షియల్ సూపర్ పవర్‌గా బలపడటం మొదలైంది. అయితే రెండవ ప్రపంచ యుద్ధం నాటికే అత్యధిక బంగారం నిల్వలతో అమెరికా స్వర్ణ మార్కెట్ బలంగా వున్నది. వస్తువుల స్థానంలో పెట్టుబడులను ఎగుమతి చేయుటమూ ప్రారంభించింది. యుద్ధ సమయంలో మిత్ర దేశాలకు విస్తారంగా రుణాలనిచ్చింది. ఓడిన దేశాల పునరుద్ధరణకు ఫైనాన్స్ సహాయం చేస్తామని హామీ ఇచ్చింది. నయానా భయానా అమెరికన్ డాలర్‌నే గ్లోబల్ కరెన్సీగా ఆమోదించ టానికి ఒత్తిడిని తెచ్చింది. ఈ సమావేశంలో ఒక రష్యా మినహాయించి మిగిలిన 44 దేశాలూ డాలర్ ఆధిపత్యాన్ని

ఆమోదించాయి. ఎటువంటి సూపర్ పవర్ నైనా సమస్య స్వభావం దృష్ట్యా ఎదిరించగల సత్తా కేవలం సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలను కొనసాగించే దేశాలకు మాత్రమే వుంటుందని ఆనాడే రుజువైంది.

1930ల ప్రపంచ మాంద్యం నుండి సామ్రాజ్యవాద దేశాలను బయట పడేయటానికి బలమైన విధానాలను సూచించిన జె.యం.కీన్స్ ఈ సమావేశంలో బ్రిటన్ తరఫున మాట్లాడుతూ, ఏ దేశ కరెన్సీ ఆధిపత్యం లేకుండా 'కరెన్సీ న్యూట్రల్ వ్యవస్థ (తటస్థ ద్రవ్య వ్యవస్థ)ను' ప్రతిపాదించాడు. ప్రతీ దేశానికి ఎగుమతుల, దిగుమతుల జమా ఖర్చుకు ఒక 'Bancor' అన్న అకౌంట్ ఉండాలని, లోటు పరిమితి దాటినప్పుడు మాత్రమే ఆ దేశ కరెన్సీ మారకం రేటు మూల్య హీనీకరణ చెందుతుందని ప్రతిపాదించాడు. దీనిని అమెరికా తిరస్కరించింది. అమెరికా నిర్ణయాన్ని కాదనే సాహసం ఏ దేశానికీ లేదు. ఇట్లా బెదిరించి, బుజ్జగించి "ప్రజాస్వామికంగా" అమెరికా డాలర్ గ్లోబల్ కరెన్సీ అయింది.

ఇందులో ప్రతీ దేశపు కరెన్సీ మారకపు రేటును స్థిరంగా అమెరికన్ డాలర్‌కు కట్టివేస్తారు. తమ 35 డాలర్లకు ఒక ఔన్సు బంగారాన్ని ఏ దేశమైనా తమ వద్ద నుండి డాలర్ల సెక్యూరిటీతో అమెరికా నుండి తీసుకోవచ్చని ఒప్పందం చెబుతుంది. కానీ వియత్నాం యుద్ధం కోసం అమెరికా విరివిగా డాలర్లను ప్రింటు చేసుకున్నది. ప్రపంచ దేశాల నుండి డిపాజిట్లను సేకరించింది. బాండ్లను, సెక్యూరిటీలను విక్రయించింది. బంగారం నిల్వలు తగ్గిపోవటం మొదలైంది. అందువల్లనే చాలా దేశాలు తమ వద్దనున్న అమెరికన్ డాలర్లకు సమానమైన బంగారాన్ని ఇవ్వాలని అమెరికాను డిమాండ్ చేశాయి. ఏ ఆధిపత్య దేశం/ వర్గం అయినా తమకు ఇబ్బందిని కలిగించే తమ హామీని నిలుపుకోదు. ఆనాటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ అమెరికన్ డాలర్లకు సమానమైన బంగారాన్ని ఇచ్చేది లేదని తెగేసి ప్రకటించాడు. దానితో కరెన్సీని ముద్రించటంలో స్వర్ణ ప్రమాణం అంతం అయింది. ఫియట్ కరెన్సీ మొదలైంది. స్థిర మారకం రేటు స్థానంలో సరళమైన మారకం రేటు ప్రారంభమైంది.

అయినప్పటికీ, ఆశ్చర్యకరంగా అమెరికా తిరస్కరించిన హామీని ఏ దేశమూ ప్రశ్నించలేదు. సరికదా అమెరికన్ డాలర్ ఆధిపత్యం కొనసాగింది. గ్లోబల్ కరెన్సీగా స్థిరపడి, బలపడింది.

**తృతీయ ప్రపంచ దేశాలపై ప్రభావం :**

అమెరికన్ డాలర్, అమెరికా దేశీయ కరెన్సీ. అదే సమయంలో గ్లోబల్ కరెన్సీ కూడా. కాబట్టి IOU అంటూ ఏ పరిమాణంలో నైనా డాలర్లను ముద్రించి మిలటరీ మీద, ఆయుధ రంగంలో రీసెర్చ్, డెవలప్‌మెంట్ మీద ఖర్చు పెడుతుంది. వర్ధమాన దేశాలలో యుద్ధ భయాన్ని తానే సృష్టించి, యుద్ధ సామాగ్రిని విరివిగా అమ్ముకుంటుంది. ఈ దేశాలకు అప్పులిస్తుంది. అవి వాళ్ళు డాలర్లలోనే తిరిగి చెల్లించాల్సి వుంటుంది. అమెరికన్ డాలర్ ముద్రణా యంత్రానికి, ఇట్లా వర్ధమాన దేశాలను అప్పుల ఊబిలో ముంచగల శక్తి ఉండటం కఠినమైన వాస్తవమే.

ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు డిపాజిట్లలో పెద్ద మొత్తంలో అమెరికన్ వాటా వుంటుంది. ఈ అంతర్జాతీయ సంస్థలు ఇక తప్పనిసరిగా అమెరికా నియంత్రణలోనే ఉంటాయి. వర్ధమాన దేశాలకు ఈ సంస్థలు అమెరికన్ డాలర్లలోనే రుణాలను ఇస్తాయి. తిరిగి చెల్లించాల్సింది డాలర్లలోనే. రుణాలు ఇచ్చే క్రమంలో నయా ఉదారవాద విధానాలను అనుసరించాలన్న షరతు తప్పకుండా వుంటుంది. ఈ మొత్తం ప్రక్రియలో డాలర్‌కు డిమాండ్ పెరుగుతుంది. వర్ధమాన దేశాల మీద నియంత్రణ కూడా బలపడుతుంది. అమెరికా తాను ముద్రించిన డాలర్లను బడా సంస్థలకు సున్నా వడ్డీకి రుణాలుగా ఇస్తుంది. మరొకవైపు నయా ఉదారవాద చట్రంలో బందీలైన వర్ధమాన దేశాలు, విదేశీ పెట్టుబడుల వెంపర్లాటలో ఈ సంస్థలను రాయితీలు, ప్రోత్సాహకాలతో ఆహ్వానిస్తాయి. ఈ దేశాలలో దేశీయ పెట్టుబడి అదృశ్యమౌతుంది. దేశీయ పొదుపు, ఇక విదేశీ పెట్టుబడుల వశమై, ఫైనాన్స్ పెట్టుబడులు మరింత బలపడతాయి. వర్ధమాన దేశాల స్వావలంబన అన్నది ఆయా దేశాల రాజ్యాంగాలలో మాత్రమే నిక్షిప్తమై ఉంటుంది. అధీనత బలోపేతం అవుతుంది.

అప్పులపాలైన వర్ధమాన దేశాల మీద ఎగుమతుల కేంద్రంగా అభివృద్ధి దిశగా విధానాలుండాలని ఒత్తిడి వుంటుంది. ఎగుమతులను పెంచుకోవటానికి స్వదేశీ కరెన్సీ మారకం రేటును తగ్గించుకోవాలి. అంటే అదే మొత్తం డాలర్లకు గానూ ఎగుమతి చేయవలసిన స్వదేశీ వస్తువులు ఎక్కువ పరిమాణంలో ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ఎగుమతులు ప్రధానంగా శ్రమ సాంద్రతతో వుండటం వల్ల శ్రమదోపిడీ మరింత తీవ్రం అవుతుంది. ఎగుమతుల ఆధారిత ఉత్పత్తులను సృష్టించే శ్రామికుల శ్రమశక్తిని డాలర్ నేరుగా పీల్చి వేయగలుగుతుంది. శ్రామిక వర్గానికి ప్రధాన శత్రువు సామ్రాజ్యవాదమన్న మార్క్సిస్టు మహోపాధ్యాయుల మాటలను ఈ వాస్తవం రుజువు చేస్తున్నది. ఆయా దేశీయ కరెన్సీలలో దిగుమతుల ధరలు పెరుగుతాయి. అంటే వర్ధమాన దేశాల ధరలు, ఆయా దేశాల ద్రవ్య విధానం పరిధిలో ఉండవు. అమెరికన్ డాలర్ మాత్రమే వీటిని నిర్ణయిస్తుంది. అంతే కాకుండా ఈ విదేశీ పెట్టుబడులు వర్ధమాన దేశాలలో సుస్థిరంగా ఉండవు. అమెరికా వడ్డీ రేటును పెంచితే, ఇవన్నీ అమెరికాకు వాపసు వెళ్తాయి. వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థలు ఛిన్నాభిన్నం అవుతాయి. అమెరికా, దాని మిత్ర దేశాల, మొత్తంగా సామ్రాజ్య వాద దోపిడీ శక్తుల గుప్పిట్లో వర్ధమాన దేశాలుంటాయి. సామ్రాజ్యవాద మిత్ర దేశాలు అన్నింటికీ అమెరికా నాయకత్వం ఆమోదయోగ్యమే. అమెరికా అడుగుజాడల్లో నడుస్తాయి. ఈ

మిలాఖత్‌కి ప్రధాన కారణం ప్రపంచంలో సోషలిజం అన్న పదం గానీ, సోషలిస్టు ఆర్థిక విధానాల అవశేషాలుగానీ లేకుండా అంతరించాలన్నదే. సామ్రాజ్యవాద దోపిడీ కొనసాగటానికి, బలపడటానికి ఇది వారికి అవసరం.

రంజిత్ షా విశ్లేషణ ప్రకారం ఐ.ఎం.ఎఫ్, ప్రపంచ బ్యాంకు మొదలైన అంతర్జాతీయ సంస్థలు కొనుగోలు శక్తిలో తేడాల ఆధారంగా మారకం రేటును నిర్ణయిస్తాయి. దాని వల్ల వెనుకబడిన దేశాల కరెన్సీల మారకం రేటు తక్కువ స్థాయిలో, అభివృద్ధి చెందిన దేశాల కరెన్సీ మారకం రేటు అధిక స్థాయిలో నిర్ణయించబడుతుంది. అందువల్ల వెనుకబడిన దేశాల్లోని విదేశీ పెట్టుబడులకు ఉత్పత్తి, వాణిజ్యం ద్వారానే కాకుండా అసమ మారకం వల్ల కూడా లాభాలు సమకూరుతాయి. పైగా ఆధిపత్య దేశాల కరెన్సీ మారకం విలువ అధికంగా నిర్ణయించబడటం వల్ల ఆ కరెన్సీ ఆస్తిగా పరిగణించడంలో టర్నోవర్ ఎక్కువగా వుంటుంది. ఆ కరెన్సీ ఆధిపత్యం కొనసాగుతూనే ఉంటుంది.

సి.టి. కొరియన్ అధ్యయనం ప్రకారం 1990ల నాటికి ఫైనాన్స్ మూలధనం బలపడడంతో గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ కోణం పూర్తిగా మారిపోయింది. ఫైనాన్షియల్ లావాదేవీలలో 90 శాతానికి వాస్తవ ఆర్థిక వ్యవస్థతో, వస్తుసేవల ఉత్పత్తితో సంబంధమే వుండదు. వడ్డీ రేటు, మారకం రేటు మార్పులను అంచనాలు వేస్తూ ఫైనాన్షియల్ స్పెక్యులేషన్ మార్కెటు ఊపందుకున్నది. ఈ లావాదేవీలన్నీ అమెరికన్ డాలర్లలోనే. 1991-92లో కేవలం ఇండియాలో నడిపిన ఈ వ్యవహారాల వల్ల విదేశీ బ్యాంకుల లాభాలు 1000 కోట్ల రూపాయలకు మించిపోయింది. 1970లో విదేశీయులతో అమెరికా సెక్యూరిటీ లావాదేవీల విలువ అమెరికా స్థూల దేశీయోత్పత్తిలో మూడు శాతం ఉండగా, 1990 నాటికి అది 93 శాతానికి పెరిగింది.

Trinnial Central Bank Survey of FX and OTC derivatives market ప్రకారం ఫైనాన్షియల్ మార్కెట్లో 2019లోనే ఫారెక్స్ మార్కెట్, రోజువారీ 6.6 ట్రిలియన్ల అమెరికన్ డాలర్ల లావాదేవీలతో స్టాక్ మార్కెట్‌ను మించి పోయింది. 2021లో ప్రపంచ ఫారెక్స్ మార్కెట్ విలువ 2409 క్వాడ్రీలియన్ (ఒక క్వాడ్రిలియన్ = 1000 ట్రిలియన్లు) అమెరికన్ డాలర్లు. "సామ్రాజ్యవాదం - పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క అత్యున్నత దశ" పుస్తకంలోని సిద్ధాంత విశ్లేషణలో 1916లో కామ్రేడ్ లెనిన్ అంచనా వేసిన విధంగా ఫైనాన్స్ పెట్టుబడులు వ్యవస్థలను ఎలా నియంత్రణలో పెట్టుకుంటాయో స్పష్టంగా చెప్పిన అంచనాలు రుజువైనాయి.

**అమెరికా విధిస్తున్న ఆంక్షలు :**

అమెరికా సామ్రాజ్యవాద దోపిడీ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవటానికి నిరాకరించిన ఏ దేశం మీదనైనా అమెరికా, 1950ల నుండే ఆంక్షలను విధిస్తున్నది. ఎగుమతి, దిగుమతులను నిషేధించటం, అమెరికా బ్యాంకులో దాచుకున్న డిపాజిట్లను స్తంభింపచేయటం, డాలర్లలో వున్న సెక్యూరిటీలను వాడుకోకుండా చేయటం జరుగుతుంది. కొన్ని సందర్భాలలో దేశం మొత్తం మీద కాకుండా కొంతమంది వ్యక్తుల మీద, సంస్థల మీద ఆంక్షలను విధిస్తుంది. గత 5 సంవత్సరాల నుండి అమెరికా ఏ దేశం మీద నైనా విధించిన ఆంక్షలను థర్డ్ పార్టీ దేశాలు కూడా అనుసరించాలన్నమాట. 1990ల నుండి ఆంక్షలను విధించటం ముమ్మరమైంది. స్వేచ్ఛా వాణిజ్యం లక్ష్యం అంటూ పనిచేసే ప్రపంచ వాణిజ్య సంస్థకు ఆర్థికేతర కారణాలతో అమెరికా విధిస్తున్న వాణిజ్య ఆంక్షలు ఆమోదయోగ్యమే. 1993 నుండి 36 దేశాల మీద 40 ఆంక్షలను విధించింది. మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నదంటూ 1950లో ఉత్తర కొరియా, 1958లో క్యూబా, 1979లో ఇరాన్, 1986లో సిరియా, 2019లో వెనుజులా, ప్రస్తుతం రష్యా మీద ఆంక్షలను విధించింది. ప్రపంచ దేశాలను, ప్రధానంగా వర్ధమాన దేశాలను గుప్పిట్లో పెట్టుకోవటానికి నియంతలా విధానాలను అమలుపరిచే అమెరికా ప్రజాస్వామ్యం, మానవ హక్కుల ఉల్లంఘనలను గురించి మాట్లాడటం హాస్యాస్పదమే. క్యూబా మీద ఆంక్షలు సరికాదని, రద్దు చేయాలని UNO జనరల్ అసెంబ్లీ 29 సార్లు తీర్మానించింది. నోమ్‌చామ్‌స్కీ డిమాండ్ చేస్తూనే ఉన్నాడు. కాగా కోవిడ్-19 విపత్తును ఎదుర్కోవటంలో పటిష్టమైన ప్రజారోగ్య వ్యవస్థతో శక్తివంతమైన ఆదర్శ నమూనాగా క్యూబా ప్రపంచం ముందు నిలిచింది.

ప్రస్తుతం రష్యా మీద, రష్యా సంపన్న వర్గం మీద, 1000 బడా సంస్థల మీద అమెరికా ఆంక్షలను విధించింది. ప్రధానమైన 7 బ్యాంకులను స్విఫ్ట్ నుండి నిషేధించటం వల్ల అంతర్జాతీయ బ్యాంకు లావాదేవీలు సాధ్యం కాని పరిస్థితి ఏర్పడింది. అమెరికాను అనుసరిస్తూ యూరోపియన్ యూనియన్ దేశాలు, ఇంకా మరికొన్ని దేశాలు అమెరికాకు మద్దతుగా రష్యా మీద ఆంక్షలను విధిస్తూనేవున్నాయి. ఇందులో భాగంగా రష్యన్ సంపన్నవర్గాల విలాసవంతమైన జీవితాల కోసం బ్రిటన్ విక్రయించే గోల్డెన్ వీసాలను నిలిపివేసింది. అయితే 1990లలో రష్యాలో ప్రైవేటీకరణ సందర్భంలో ఉన్నత పాలకవర్గాలు, ఉన్నతాధికారులు ప్రజల నుండి లూటీ చేసిన అపారమైన సంపదతో లండన్, న్యూయార్క్‌లో భారీఎత్తున షేర్లు కొనుక్కున్నారు. బ్రిటన్‌లో లగ్జరీ భవనాలను, యాట్స్ (Yatchts), వ్యక్తిగత విమానాలను కొనుక్కున్నారు. ప్రజల నుండి లూటీ చేసిన సొమ్ముతో సంపన్న వర్గాలు విలాస వంతంగా, భద్రతతో జీవించటానికి సామ్రాజ్యవాద దోపిడీ దేశాలు ఎటువంటి వసతులను కల్పిస్తాయో ఈ ఉదాహరణ స్పష్టం చేస్తుంది. అందువల్లనే వికీలీక్స్, పనామా పేపర్లు, పండోరా పేపర్లు అపారమైన నల్లధనం ఎవరి వద్ద, ఏ రూపంలో వుంటాయో బయటపెట్టినాయి.

సంపన్న వర్గాలకు, ఇతర సామ్రాజ్యవాద దేశాలకు కూడా ఈ డాలర్ ఆధిపత్యం ఇబ్బంది కలిగిస్తున్నది. 2009 నుండే రష్యా, చైనాతో పాటు ఐ.ఎం.ఎఫ్ ప్రత్యామ్నాయ గ్లోబల్ కరెన్సీ గురించి ప్రయత్నిస్తున్నాయి. రెండవ స్థానంలో వున్న యూరో, మూడవ స్థానంలో వున్న జపాన్ యెన్, నాల్గవ స్థానంలో ఉన్న చైనా యువాన్‌ల బలాబలాల గురించి చర్చలు జరుగుతూనే వున్నాయి. సామాన్య ప్రజలను దోచుకునే నకిలీ కరెన్సీ అయిన క్రిప్టోకరెన్సీ గురించి ప్రత్యామ్నాయంగా ఆలోచించటానికి కూడా వెనుకాడటం లేదు. అందువల్ల డాలర్ ఆధిపత్యం వున్నా, దాని స్థానంలో ఇతర కరెన్సీలు ఆధిపత్య స్థానాన్ని ఆక్రమించినా, ఫైనాన్స్ పెట్టుబడులు విస్తరిస్తూనే వుంటాయి. సామ్రాజ్యవాద దోపిడీ బలపడుతూనే వుంటుంది. వర్ధమాన దేశాలు, అధీన వ్యవస్థలవుతాయి. పీడిత ప్రజల జీవితాలు మరింత సంక్షుభితం అవుతాయి. కాబట్టి దోపిడీ, పీడన నుండి విముక్తి కోసం ప్రధమ కర్తవ్యంగా సామ్రాజ్యవాద దోపిడీని సమూలంగా అంత మొందించే కర్తవ్యాలను చేపట్టాలి. అందుకు పీడిత ప్రజలు సంఘటితంగా, బలంగా విప్లవ శక్తుల నాయకత్వంలో వర్గ పోరాటాలతో వ్యవస్థ సమూల మార్పు లక్ష్యంగా పనిచేయాలి. ఈ క్రమంలో ఆయా దేశాలలో ఈ సామ్రాజ్యవాదానికి అండగా వుంటూ తమ దేశాల ప్రజల ప్రయోజనాలను సైతం బలి పెడుతున్న దళారీ శక్తులను ముందుపెట్టి సామ్రాజ్యవాదం తన దోపిడీకి అడ్డు లేకుండా చేసుకోజూస్తున్న నేపథ్యంలో పీడిత దేశాల ఉమ్మడి శత్రువైన సామ్రాజ్యవాదంపైన, డాలర్ ఆధిపత్యంపైన మరింత సంఘటితంగా, పరస్పర సంఘీభావ సహకారాలతో పోరాడాల్సిందే.

*****